# ★ లవణరాజు కల ★

## ప్రాచీన గాథాలహరి

### ౧

ఐంద్రజాలికుడు తన రంగురంగుల నెమలి పింఛం గిరగిరా త్రిప్పి ఏవేవో చిత్రవిచిత్రమైన మంత్రాక్షరాలు ఉచ్చరించాడు. తిరిగీ ఆ రంగురంగుల నెమలి పింఛం చేత అలాగే నెమ్మది నెమ్మదిగా వలయాకార నృత్యం చేయించాడు. అతని చేతిలో నృత్యం చేస్తున్న ఆ మయూరబర్హం తిలకించగానే లవణమహారాజాస్థానంలో సమాసీనులైన సభాసదులందరికీ తమ కళ్లెదుట వేయిబంగారు నెమళ్లొక్క మారుగా నృత్యం చేస్తున్నట్టు స్ఫురించింది! వేయి మెరుపు తీగల దృశ్యమైపోకుండా అలాగే నిలిచి ఖలయాకార నృత్తం చేస్తున్నట్టు భాసించింది! వేలాది అచ్చరలు చిత్రవిచిత్రమైన సువర్ణాలంకారాలతో, జవగంటలతో, మొలనూలి మువ్వలతో, అందెల రవళులతో అతిలోక నాట్యమేదో మెరపిస్తున్నట్లనిపించింది!

లవణ మహారాజాస్థానంలోని వారందరికీ అమనోహర దృశ్యం ప్రత్యక్షమైన కొంతసేపటికొక విధమైన తీయని మైకం కమ్మింది. పరిగంధు హొంబట్టు తెరల పూర్వరంగంలో హంసతూలికా తల్పాలపై ఒయ్యారంగా ఒరిగి ఆ మహేంద్రజాలం తిలకిస్తున్న రాణులందరూ ఒక నిమిషంలోనే గాఢ మూర్ఛాభారంతో మలిగి అలసి సొలసి నెమ్మదిగా తూలిపోయారు.

సభాసదులంతా అంతకు పూర్వం ఎన్నెన్నో ఇంద్రజాల విద్యావిచిత్రాలు సందర్శించారు కాని అంతటి విచిత్రమైన మహేంద్రజాలం వారెన్నడు చూడలేదు. మహారాజు ఇంద్రజాల విద్యా ప్రదర్శన ప్రారంభంలో ఆ ఐంద్రజాలికుని అతిలోక చాకచక్యాన్ని కొంతైనా ఆనందించాడు. అతని కనేకమణికనక భూషణాలు బహుకృతిగా సమర్పించవలెనని సంకల్పించాడు. అయితే ఆ ఇంద్రజాలం మరికొంతసేపలాగే సాగేసరికి అతనికా ఆనంద తన్మయతలో శరీరంమీది స్పృహే సడలిపోయింది. ప్రగాఢ సుషుప్తిలో ఏదో ఒక విచిత్ర స్వప్నలోకంలో ప్రవేశించినట్లు స్ఫురించింది. మరికొంతసేపటికా స్ఫురణ కూడా నశించిపోయింది. అతని హృదయం పూర్తిగా ఆ ప్రగాఢానంద లీలా తన్మయతలో విలీనమైపోయింది. సభాస్తారులు, మహారాణులు, మహారాజు, అంతా ఆ మహేంద్రజాలానంద తన్మయతలో మునిగి కేవలం శిలా ప్రతిమలైపోయారు కాని మహారాజ పార్శ్వంలో అనతిదూరంలో దర్భాసనాసీనుడైన వసిష్ఠ మహర్షి మాత్రం ఆ ఇంద్రజాల సమ్మోహనిద్రలో మునిగిపోలేదు. అలాగే నిశ్చలంగా దర్భాసనంమీద కూర్చుని చిరునవ్వుల చిలకరింపులతో ఇంద్రజాల లీల అంతా ఏకాగ్రదృష్టితో పరిశీలిస్తున్నాడు.

అంతలో ఉచ్చైశ్శ్రవంవంటి ఉత్తమాశ్వం ఒకటి సభాస్థలికనతిదూరంలో నిలబడింది. ఒక గుర్రపురౌతు దానిని అక్కడ నిలబెట్టి సభాసదులకెదురుగా చేతులు జోడించి నిలబడ్డాడు. అది మనోజవంతో సాగిపోయే ఉత్తమాశ్వమని విన్నవించాడు ఎన్ని వేల యోజనాలైనా ఇట్టే చుట్టిరాగలదని చెప్పి దాని గమనవేగం అనేక విధాల ప్రశంసించాడు. ఇంతకు పూర్వమది అరగడియలో నూరు యోజనాలు చుట్టివచ్చినదని అన్నాడు ఒకసారి దాని మనోవేగం పరిశీలించవలసిందని సవినయంగా అభ్యర్థించాడు.

అరగడియలో నూరుయోజనాలు చుట్టివచ్చే అశ్వం అంటే సభాసదులెవరికీ నమ్మక కలగలేదు. వారంతా ఒకరిముఖాలొకరు చూచుకొన్నారు.

మహారాజు వసిష్ఠమహర్షి ముఖంవైపు చూచాడు. ఆ చూపులో ఐంద్రజాలికుని మాట యథార్థమేనా అన్న భావం స్ఫురించింది.

మహర్షి ఒక చిరునవ్వు నవ్వాడు:

"మహారాజా! ఒకమారు పరిశీలించి చూడవలసిందని ఐంద్రజాలికుడే విన్నవించుకొన్నాడు కదా! ఒక అరగడియలో అనంతా తమకే విశదం కాగలదే! ఎందుకింత డోలాందోళన!"

అని మహర్షి తిరిగి ఇంకొక చిరునవ్వు నవ్వి ఆ ఉత్తమాశ్వంవైపు పరలోకించాడు. అంతలోనే అది బిగ్గరగా సకిలించింది. ఆ సకిలింపు వినగానే మహారాజు హృదయం ఎగిరి గంతువేసింది. కాని ఆ అశ్వానికంతటి శక్తిసామర్థ్యాలున్నాయా అని తిరిగీ ఒక చిన్న ఆశంకపట్టుకొని వేధించింది. క్షణంకాలం ఆ అశ్వం వైఖరి పరిశీలించాడు.

సమున్నతమైన ఆ ఉత్తమాశ్వం శిరస్సుపై అమర్చిన వింజామరం మధ్యాహ్న సూర్యకాంతిలో కాశపుష్ప గుచ్ఛంలా తళతళలాడింది వింట సంధించిన బాణంలా ఆ శ్వేతాశ్వం ముమ్ముందుకు సాగిపోవడానికై ఉరకలు వేస్తూంది పక్కనే నిలబడిన గుర్రపు రౌతు దాని కళ్లెం గట్టిగా పట్టుకుని అదిమి నొక్కిపెట్టకపోతే అది ఒకక్షణంలోనే రివ్వున ఎగిరిపోయేటట్లు కనబడింది.


లవణరాజిక వేచివుండలేక పోయాడు. ఒక్కసారిగా వెనక్కి తిరిగిచూచి వెనక తళతళ మెరుస్తున్న ఆసనోద్యానవనల దగ్గర సెలవు తీసుకొన్నాడు వసిష్ఠమహర్షికి సవినయంగా పాదాభివందనం చేసి నిలుచున్నాడు. మహర్షి లేచి నిలబడి ఎంతో వాత్సల్యంతో చేయెత్తి ఆశీర్వదించాడు. లవణరాజొక్క దూకులో గుర్రం మీద ఎక్కి కూర్చున్నాడు. అది మళ్లీ బిగ్గరగా సకిలించింది. ఒయ్యారంగా తంచిన మౌనవంపులోనే, అశ్వికుని చాకచక్యం గుర్తించినట్లుగా అది తిరిగీ ఇంకొకమారు సకిలించింది.

నగర రాజవీధి దాటిపోయేదాకా, కొంతదూరం వరకు సవిలాస మందగమనం సాగించింది అంతలో మహారాజు అరచేతితో ఆ గుర్రం వెన్నుమీద తొందర తొందరగా తట్టాడు దానితో ఆ అశ్వం శరవేగంతో పరుగులు పెట్టింది. ఉత్తరక్షణంలోనే అది ఒక మెరుపులా అదృశ్యమైపోయింది

### ౨

మహారాజు మొటమొదట ఇంద్రజాలమె అంతగా యదార్థమని విశ్వసించలేదు. తరవాత గుర్రపు రౌతుతో ప్రత్యక్షమయిన ఆ అశ్వం వైపు చూచి తన కన్నులే నమ్మలేక

పి. గణపతి శాస్త్రి



శివకంచి ఏకామ్రేశ్వర దేవాలయ అంతర్భాగము.

ఫొటో: పి వీరయ్య, సికింద్రాబద్.

పోయాడు. అప్పుడు అది అరగడియలో నూరు యోజనాలు చుట్టి రాగలదంటే — అదంతా అతనికి కేవలం అతిశయోక్తిగా భాసించింది. అయినా దాని యాథార్థ్యం పరిశీలించవలెననే దృఢనిశ్చయంతో దాని జీనుమీద కూర్చుని నెమ్మదిగా గావుపుమీద తట్టాడు. అది మిథ్యాశ్వం కాదు! స్పష్టంగా చేతికి తగిలింది. తిరిగి చెవులు గింటుకుని పెట్టు సకిలించింది. అయినా ఒకసారి స్వారి చేసి చూచి అరగడియలో నూరు యోజనాలు చుట్టి వచ్చే విషయం ప్రత్యక్షంగా పరిశీలించవలెనని అనుకొన్నాడు.

ఇంద్రజాలికుని మాటలలో అణుమాత్రమైనా అసత్యం కనిపించలేదు. ఆ అశ్వం శరవేగంతో పరిగెత్తుకు పోతూంటే మహారాజుకు కనీసం ఏ దెసగా పోయేదీ ఏమీ తెలియలేదు. కళ్ళెం మళ్ళీ గట్టిగా లాగి పట్టుకున్నాడు. అశ్వం నిలిచిపోయింది. తిరిగి నెమ్మదిగా వీపుమీద తట్టాడు. ఆ గుర్రం మళ్ళీ మనోవేగంతో దౌడు తీయడం మొదలు పెట్టింది. కొన్ని వందల యోజనాల దూరం సాగిపోయింది. అతడొక మహారణ్యంలో ప్రవేశించాడు. ధ్యాసగా చూడగా అదంతా అతనికి వింధ్యారణ్య గుర్తు ప్రాంతంలా కనిపించింది. సందేహం లేదు! అది వింధ్యారణ్య ప్రాంతమే! మహారాజు బాల్యంలో ఒకనాడు జనకునితో కలిసి ఆ ప్రాంతాలలో మృగయోత్సవంలో విహరించాడు! బాల్యంలో చూచిన ఆ మహారణ్యమే — ఆ పర్వతావళులే. వేట కత్తిని కళ్ళెం కొరుకుగా ప్రత్యక్షమైనాయి. క్షణంలో ఆ అశ్వం అంతదూరం తీసుకు వచ్చిన విషయం స్ఫురించగానే అతనికి కలిగిన ఆశ్చర్యానికి అవధి లేదు.

ఎక్కడి మయూరబ్రహ్మపురం! ఎక్కడి వింధ్యాటవి! అని లవణరాజెంతో ఆశ్చర్యపడ్డాడు. మయూరబ్రహ్మపురం భాగీరథీ తీరాన లవణరాజు పితామహ ప్రపితామహులు నిర్మించిన మహానగరం. లవణమహారాజు తాత తండ్రులలా మహానగరం రాజధానిగా ఆ పరిసర విశాలదేశం అంతా పరిపాలించి, మహా ధర్మాత్ములని ప్రసిద్ధికెక్కారు. లవణ మహారాజు కూడా ఒక్క క్షణమైనా ఏమరకుండా వారిమార్గం అనుసరించి పరమ ధర్మాత్ముడని ప్రఖ్యాతి కెక్కాడు.

వసిష్ఠ మహర్షి స్వయంగా మహారాజు చేత ఎన్నో యజ్ఞయాగాలు, దానధర్మాలు చేయించాడు. లవణరాజు పరిపాలనలో రాజ్యంలో అతివృష్టి, అనావృష్టి వంటి ఈతిబాధ లెన్నడూ పొడచూపలేదు. మహారాజు నిత్యము మహేంద్రవైభవంతో తులతూగుతూండేవాడు. మానుష సంపదలన్నీ అతనికి అనాయాసంగా లభించాయి.

అయినా లవణమహారాజు హృదయంలో తీవ్రజిజ్ఞాస ఏదో ఆరని చిచ్చులా దహించివేసేది. భోగభాగ్య బహుళమైన జీవనలీల అంతా అంతలోనే చిత్రవిచిత్రమైన స్వప్నలీలగా గోచరించేది. మహారాజ నేకమారులు వసిష్ఠమహర్షి సన్నిధిని తన తీవ్ర జిజ్ఞాస తెలుపుకు చేసుకొన్నాడు. ఎన్నెన్ని మహేంద్రభోగాలనుభవించినా నిత్యము అసంతృప్తి జ్వాల తన అంతరాంతరాలు

## ★ లవణరాజు కల ★

దహించివేస్తున్నదనీ దానికి కారణమేమీ గోచరించడంలేదనీ విన్నవించుకొన్నాడు.

వశిష్ఠమహర్షి దానికి సముచితమైన సమాధానమేమీ చెప్పలేదు. గంభీరంగా మహారాజువైపు చూచి సన్నగా ఒక చిరునవ్వు నవ్వి ఊరకున్నాడు అంతే!

సుఖదుఃఖ ద్వంద్వ సమ్మిశ్రితమై నిరంతర నిస్సార యాత్రగా సాగిపోయే జీవయాత్రలో అంతర్నిహితమైన మహాపరమార్థమేదో ప్రత్యక్షంగా సాక్షాత్కరింపజేసుకోవాలని మహారాజెన్నో మారులు సంకల్పించాడు. మహర్షి ననేక విధాల ప్రార్థించాడు. ఆయన మహాద్రష్ట! ఆ మహర్షి అతీంద్రియ దృష్టికందని పరమార్థమేమీ లేదు. మహా తపస్సమాధిలో మునిగి సశరీర బ్రహ్మీభావం పొందిన బ్రహ్మజ్ఞుడా బ్రహ్మర్షి!

తీవ్ర తపశ్చర్యాదుల అవశ్యకత లేకుండా సంకల్పమాత్రం చేతనే అన్యులకుకూడా ఆ పరమార్థ సాక్షాత్కారం కరతలామలకంగా అందింపజేయగల మహాతపశ్శాలి! ప్రత్యేకంగా లవణమహారాజంటే అపార వాత్సల్యామృతం వర్షించే కారుణ్యఘనుడు!

అయినా లవణమహారాజు సంకల్పం నెరవేరలేదు. నానాటికి జీవనలీల అంతా అతనికొక విచిత్రరూపకంగా, ఛాయామాత్రంగా భాసించేది. లోలోపలి జిజ్ఞాసాగ్ని జీవనాశలన్నీ దహించివేసేది అతనికే నేదీ దేమీ లేక కొన్నాళ్ళపాటు భోగలాలసులో మైమరచి నిత్యము ఆతిమత్తులో నే మునిగిపోయేవాడు.

ఆతన్మయతలో కొన్నాళ్ళపాటు మహారాజు వసిష్ఠమహర్షి దర్శనమైనా చేయలేదు. అనేకమైన కేళీవినోదాలతో కాలక్షేపం చేశాడు. ఆ వినోదప్రసంగంలోనే ఇంద్రజాలవిద్యాసందర్శనం జరిగింది. అనంతరమే ఆ అశ్వారోహణము, అరణ్యప్రవేశము జరిగాయి

మహారాజరణ్యం అంతా పరిశీలించాడు. కాని అక్కడినుంచి తిరిగి మయూరబద్దపురం చేరుకొనేమార్గమేదీ



A. 42

# ★ లవణరాజు కల ★

అతనికి గోచరించలేదు. ఆటవికులెందరెందరినో అడిగిచూచాడు. వారా పట్టణం పేరైనా విన లేదని అన్నారు. తిరిగీ స్వనగరం చేరుకోవడమెలాగ?

అప్పుడే సూర్యాస్తమానంఅయిపోయింది ఐంద్రజాలికుడరగడియలోగానే ఆ అశ్వం నూరుయోజనాల భూవలయం చుట్టివచ్చి సురక్షితంగా మయూరబర్హనగరానికి తిరిగి రాగలదని అన్నాడు.

ఎన్నెన్నో అరగడియలు గడిచిపోయాయి. ఎక్కడా దారి కనబడలేదు. అంతలోనే చీకట్లుకూడా అలముకొన్నాయి. అరణ్యంలో కీచురాళ్ళమోత ప్రపంచలీలా సంగీతానికంతటికీ ఒక గంభీరశ్రుతిగా వినవస్తున్నది. ఇక కాలయాపనవల్ల ప్రయోజనమేమీ లేదని లవణ మహారాజా అశ్వాన్ని గట్టిగా అదిలించాడు.

అశ్వం బాగా అలిసిపోయిందేమో! ఆశించినంత మహావేగంతో పరిగెత్తలేదు. పరిగెత్తగా పరిగెత్తగా ఎక్కడైనా ఏదైనా మార్గం గోచరించక పోతుందా అని అతని ఆశ!

ఆఅశ్వాన్ని మళ్ళీ గట్టిగా అదిలించాడు. అది దుర్గమారణ్యమార్గమైనా లక్ష్యపెట్టకుండా ఒళ్లెరగని వేగంతో తొందరతొందరగా పరిగెత్తడం మొదలు పెట్టింది.

ఆ మహావేగంలో ఒక పెద్దచెట్టు కొమ్మ గట్టిగా అతని నుదుటికి తగిలింది. వెంటనే అతనికి ఒంటిమీద స్మారకం తప్పిపోయింది. కళ్లెం పట్టు తప్పిపోయింది

లవణ మహారాజు తక్షణంలో చాపచుట్టగా నేలమీద పడిపోయాడు. అతని శరీరం అంతా రక్తసిక్తం అయిపోయింది. అయినా అశ్వం ఆవిషయం గమనించలేదు. అలాగే శరవేగంతో పరుగెత్తుకు పోయింది. ఆ ఆఘాతంతో లవణ మహారాజు పూర్వస్మృతులన్నీ క్రమక్రమంగా విస్మృతి కుహరంలో పడిపోయాయి.

ఆ మర్నాడు బల్లున తెల్లవారింది. సూర్యకిరణాలింకా వింధ్యారణ్యం మూల మూలలదాకా చొచ్చుకుపోలేదు. గడిచిన రాత్రి అంతా అరణ్యమధ్యంలో శరీర స్పృహైనా లేకుండాపడిఉన్న లవణరాజు తెల్ల తెల్లవారేవేళ మెలిగా కళ్లు తెరిచాడు.

ఒక శబర యువతి అతనిపార్శ్వంలో కూర్చుని శీతలోపచారాలు చేసింది. మహారాజా మెవైపు చూచాడు.

ఆమె తలకట్టు నిండా అడివిపువ్వులు. మెడనిండా గురివెందపూసలదండలు. ఆ యువతి గాయాలకన్నిటికీ కట్లుకట్టి అతని నొక మెత్తని పర్ణశయ్యపై పరుండబెట్టింది. పక్కనే కూర్చుని ఎంతో ఆప్యాయంగా ఉపచారాలు చేసింది:

లవణరాజు కళ్లు తెరవగానే ఆమెకళ్లు వికసించాయి. ఏదో అడిగింది. అతనికామె అరణ్యభాష తెలియలేదు. తిరిగి సంజ్ఞల ద్వారా ఆమె తన అభిప్రాయం వ్యక్తీకరించింది. కాని సంజ్ఞలకు పూర్వం కనుచూపులే ఆమె మనోభావం వ్యక్తీకరించాయి.

మహారాజా అశ్వమేమైపోయినదని అడిగాడు. అతని సంజ్ఞలేవీ ఆమెకు తెలియలేదు అమాయికమైన కలకల నవ్వులతోనే సమాధానం చెప్పింది.

లవణరాజు హృదయంలో ఎన్నో భయాందోళన లుదయించాయి. ఆ అశ్వమేమైపోయిందో! అర గడియలో నూరు యోజనాలమేర పరిభ్రమించి భద్రంగా తిరిగి మయూరబర్హనగరం చేరుకొనగలదని ఐంద్రజాలికుడతనితో అన్నాడు, ఐంద్రజాలికుని మాటలు చాలావరకు యథార్థాలైనాయి కాని ఆ ఒక్క విషయం మాత్రమే యథార్థం కాలేదు. ఇక అతనికి తిరిగీ మయూరబర్హనగరం చేరుకొనే మార్గమేమీ గోచరించలేదు.

పిమ్మట అలాగలాగ రోజులు, వారాలు మాసాలు గడిచిపోయాయి అప్పటికి అతనికి తిరిగీ స్వదేశం చేరుకునే ఆశ పూర్తిగా నశించిపోయింది.

కొంతకాలానికి శబర యువతి అతన్ని శబరగ్రామానికి తోడుకొనిపోయింది. ఆటవికులందరు అతని ననేకవిధాల గౌరవించి ఆదరించారు.

కాని ఎవరు మయూరబర్హనగరానికి మార్గం చెప్పలేకపోయారు. అటుపిమ్మట అలాగే ఇంకొక సంవత్సరం గడిచిపోయింది. ఆ శబరయువతి రాత్రింబగళ్లు అలాగే అతనికి పరిచర్యచేసి మహారాజు హృదయం ఆకర్షించింది.

లవణరాజామెతో కలిసి అడవిలో మృగయాది వినోదాలతో కాలక్షేపం చేసేవాడు కొండకాలవలలో ఆమెతో కలిసి జలక్రీడ లాడేవాడు. చల్లని లేతలేత పచ్చిక బయళ్లలో మబ్బులనీడలు పరుగులుపెట్టే సంజవేళలో ఆమెతో కలిసి గహనసీమలలో విహరించేవాడు.

ఆ ఆటవికుల నిసర్గసరళ జీవనధోరణి అతనికెంతో హృదయంగమమై స్ఫురించింది. కొన్నాళ్లకతనికి వారితో కలిసిమెలిసి సంచరించడము, సంభాషించడము కూడా అలవాటయి పోయాయి

మరి కొంతకాలానికతనికి పూర్వకాల మహారాజ జీవితం అంతా ఒక పూర్వజన్మవృత్తాంతంగా అస్పష్టలీలగా స్ఫురించింది. దానికంటె సరళ స్వచ్ఛమయిన అరణ్యజీవితమే వేయిమడుగులెక్కువ ఆనందదాయకమని తోచింది. క్రమంగా శబరయువతి గాఢానురాగం అతని హృదయంలో కొండమల్లె తీగలా అలుముకు పోయింది. ఇంకా కొంతకాలానికి వారిదరికీ వివాహం కూడా జరిగింది. అప్పటినించీ అతనికి శబరయువతిని 'గిరిమల్లిక' అని పిలవడం ఒక పరిపాటి అయింది.

ఆ వివాహంతో ఆటవికులందరు అతనికత్యంతాప్తులైనారు. అరణ్యమైనా ఆటవిక బంధుమిత్రుల మధ్యలో అది మహారాజు మనస్సులో మయూరబర్హపురంలాగే మెరిసింది.

క్రమంగా గిరిమల్లిక కిద్దరు పుత్రులు, ముగ్గురు పుత్రికలు కలిగారు. ఆ సంసార జంజాటంలోపడి లవణరాజు తన పూర్వవృత్తాంత వేదన అంతా విస్మరించివేశాడు. అంతఃపురంలో రాణులు, వారి అనురాగాలు, ఆ మహారాజ భోగాలు అన్నీ అతనికి కేవలం పురాతన జన్మానుబంధాలుగా కనిపించాయి. సంవత్సరాలు గడిచిన కొద్దీ ఆ ఆటవికుల మధ్యనున్న మహారాజు జీవితం తలవని తలంపుగా ఎంతో ఆనందదాయకంగా హాయిగా గడిచిపోయింది. కాని అతని ఆనంద జీవితం అలాగ అట్టే కాలం కొనసాగలేదు! —మిగిలినది పైవారం.


## -స్త్రీలకు సంతోషకరవార్త-

సంతానం కలుగలేదని నిరాశపడకండి. గర్భము వచ్చి పోతూవుంటే గర్భము నిలుపుకొనుట సులభసాధ్యం-శిశువులు కొన్ని మాసములే జీవించుచున్నచో, అట్టి మరణములను నివారించగలము. ఋతు సంబంధమైన సమస్త వ్యాధి బాధలకు 16 సంవత్సరముల నుండి చేయుచున్న గృహవైద్యము.

వివరములకు వ్రాయండి.

శ్రీమతి జాస్తి పర్వత వర్ధనమ్మ,
పడమరవీధి, ఏలూరు.

# ★ లవణరాజు కల ★

[గత సంచిక తరువాయి]

3

క్రమంగా అతని సంసార జంజాటం బాగా బలిసిపోయింది లవణరాజు రోజూ వేటకు వెళ్ళి కుటుంబంకోసం, మాంసాహారము, పుట్టతేనె, కందమూలాలు, ఫలాలు మొదలైనవి సంపాదించేవాడు ఒక్కొక్కనాడవి సంపాదించడం ఎంతో దుష్కరమైపోయేది

ఒకనాడుదయమే అరణ్యానికి వెళ్ళిపోయాడు వేట తమకంలో అతనికి కాలం గడిచిందీ తిన్నగా తెలియలేదు గ్రీష్మ తపం నెత్తి మాడ్చివేసింది దాహంతో నాలుక పిడచగట్టుకుపోయింది అడివిలో కనుచూపు మేరలో ఎక్కడా నీటిజాడ కనబడలేదు వెనువెంటనే శబర గ్రామానికి మళ్ళిపోవాలని నిశ్చయించుకొన్నాడు తొందర తొందరగా నడిచి గ్రామం పొలిమేర చేరుకున్నాడు

కారు మబ్బులు కమ్మినట్లుగా ఆకాశం అంతటా పొగ కమ్మింది ఆదట్టమైన పొగలో అప్పుడప్పుడగ్నిజ్వాలాజిహ్వలు కూడా ప్రత్యక్షమైనాయి అతడరణ్యంలో దావాగ్ని చెలరేగి ఉండవచ్చునని అనుకొన్నాడు అది శబర గ్రామం కూడా దహించివేసిందేమోనని అతనికి భయం వేసింది. తొందరగా పరుగులు పెట్టి తనపల్లె చేరుకున్నాడు.

ఆ పల్లె అంతా భస్మీపటలమైపోయింది. శబరులలో చాలామంది దూరదూర ప్రదేశాలకు పారిపోయారు మిగిలినవారా కార్చిచ్చులోపడి భస్మమైపోయారు. అతని కుటీరంకూడా ఆ దావాగ్నిజ్వాలలో దగ్ధమైపోయింది గిరిమల్లిక, ఇద్దరు మగపిల్లలు మాత్రం ఆ ప్రాంతంలో ఒక చెట్టునీడలో తలదాచుకొన్నారు మిగిలినపిల్లలగ్నిజ్వాలలకాహుతి అయిపోయారు

లవణరాజు వారందరినీ ఓదార్చి, ఆ అరణ్యంలో మరిఒక సురక్షిత ప్రాంతానికి తీసుకుపోయాడు

అక్కడికి వెళిన తరవాతకూడా అతని కష్టాలు గట్టెక్కలేదు ఆ నూతన పరిసరాలలో అతనికి బంధుమిత్రులెవరూ కనబడలేదు శబర గ్రామంలోని బంధుమిత్రులంతా ఒకరైనా మిగలకుండా అరణ్యంలో మరిఒక దూరప్రాంతంలో తలదాచుకొన్నారు.

అక్కడ కందమూలఫలాదులు దొరకడం కూడా చాలా కష్టమైపోయింది. ఎంతో శ్రమ సేగాని ఒక్కొక్కనాడెవరికీ ఆహారమే లభించేదికాదు. ఎంత వెదికినా ఆ ప్రాంతంలో ఎక్కడా అరణ్యమృగాలే కనబడలేదు. క్రమంగా లవణరాజు భార్య గిరిమల్లిక, పసిపిల్లలు కడుపునిండా ఆహారమైనా దొరకక చిక్కి శల్యాలైపోయారు. బంధుమిత్ర శూన్యమైన ఆ నిర్జనారణ్యం అంతా వారికొక పీడకలలా కనిపించింది

మరి కొంతకాలానికి పసిపిల్లలిద్దరు బాగా చిక్కి శల్యాలై మంచంపట్టారు గిరిమల్లిక కూడా నీరసించిపోయింది ఎక్కడైనాఒక్క కందమూలమైనా సంపాదించి పిల్లల

## ప్రాచీన గాథాలహరి

ప్రాణాలు, తన ప్రాణాలు నిలపవలసిందని ఒకనాడు కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడింది తరవాత ఆమె మరి మాటాడటానికి కూడా ఓపికలేక ఆ ప్రక్కనే ఒక మంచం మీద కూలబడి పోయింది

మహారాజా దుర్భర దారిద్ర్య దీనావస్థకెంతో విచారించాడు. ఎల్లాగైనా ఆ పరిసరం అంతా గాలించి పిల్లలకు, భార్యకు కందమూలాలు సంపాదించవలెనని నిశ్చయించుకొన్నాడు

పిమ్మట ఆ పరిసరారణ్యం అంతా గాలించాడు ఎక్కడా ఒక చిన్న కందమూలమునా సంపాదించలేకపోయాడు అయినా అతడు తనపట్టు విడవలేదు కాళ్ళలో సత్తువ ఉన్నంతవరకు ఆ అరణ్యం అంతా గాలించాడు అదేమి దుర్దైవ దుర్విపాకమో!

ఎక్కడా ఒక్క మృగంగాని, కందమూలంగాని, ఫలంగాని కనిపించలేదు

అతని శరీరంలో జీవశక్తి అంతా క్షీణించిపోయింది ఇక ఒక్క అడుగైనా ముందుకు వేయలేడు. అయినా శాయశక్తులా ప్రయత్నించి తుదిగడియలలో భార్యాపుత్రులనైనా కళ్లారా చూచి ప్రాణాలు విడువవలెనని అనుకొన్నాడు. శరీరంమీది స్మారకంకూడా తప్పిపోయే విషమపరిస్థితి ఏర్పడింది ఇక నడక మంచిదికాదని అక్కడనే ఒక చెట్టునీడలో కూలబడిపోయాడు

ఎంతటి దురదృష్టం! కార్చిచ్చులో పుత్రికలందరు భస్మమైపోయారు మిగిలిన ఇద్దరు పుత్రులు, భార్య క్షుధార్తులై శల్యావశిష్టులై పడిఉన్నారు. వారికొక్క కందమూలం కూడా సంపాదించలేకపోయాడు. అతని శరీరంలో జవసత్త్వాలన్నీ ఉడిగిపోయాయి దిక్కులేని పక్షిలా నిర్జనారణ్యంలో ఒక చెట్టుకింద పడిపోయాడు ఆకలి చిచ్చు అతని శరీరంలోని నరనాడులు దహించివేసింది ఒక్క కనుమూపులో మాత్రమే అతని పంచప్రాణాలు నిలబడ్డాయి ఆక్షణంలోనో ఉత్తరక్షణంలోనో అవి కూడా ఎగిరిపోయేటట్లున్నాయి అంతలోనే అతని కళ్ళకెదురుగా తెల్లని మృగమేదో కనిపించింది. పరిశీలనగా దానివైపు చూచాడు అది అరణ్యంలో పచ్చగడ్డి మేస్తూ నెమ్మదిగా అతనివైపే నడిచి వస్తున్నట్టు కనిపించింది. అది అతడెక్కివచ్చిన శ్వేతాశ్వం!

౪

లవణరాజెలాగో అలాగ తన శక్తిఅంతా ఉపయోగించి కుటీరంలో శల్యావశిష్టులై పడిఉన్న భార్యాపుత్రులనొకమారు కళ్ళారా చూచుకొని వారి సన్నిధినే వారితోబాటే తన నిస్సహాయ నికృష్ట జీవన విముక్తి పొందవలెనని అనుకొన్నాడు. ఎలాగో అలాగ పక్కనున్న చెట్టు పట్టుకొని లేచి నిలబడ్డాడు. అదృష్టవశాత్తు ఆ అశ్వం అతని దగ్గరకేవచ్చి నిలబడింది తన యావచ్ఛక్తీ ఉపయోగించి దానిమీద ఎక్కి కూర్చున్నాడు వెంటనే తన కుటీరానికి ప్రయాణమైనాడు

అతడింతకు పూర్వం అహోరాత్రులు అనవరతంగా మహేంద్ర భోగభాగ్యాలలో మునిగితేలేవాడు ఇప్పుడు భార్యాపుత్రులాకటిచిచ్చుతో అల్లాడిపోతుంటే వారికొక కందమూలమైనా సంపాదించలేక

పి. గణపతిశాస్త్రి

పోయాడు. వారాకటితో ప్రాణాలు విడుస్తుంటే కళ్ళారా చూడవలసినంత పరమ దౌర్భాగ్యస్థితి పట్టింది. ఎంత దురదృష్టం! అయినా ఆ తుదిగడియలోనైనా వారి సన్నిధికిపోయి వారితోబాటే తాను ప్రాణ పరిత్యాగంచేసి దుర్భర దుఃఖవిముక్తి పొందవలెనని అనుకొన్నాడు.

కాని ఆ అశ్వం అతని కుటీరంవైపు పోలేదు శరవేగంతో ఎక్కడికో పరుగెత్తుకుపోయింది. రాజు కాయశక్తులా దానిని అగుపులో ఉంచవలెనని ప్రయత్నించాడు కాని సాధ్యంకాలేదు. ఆ ఆయాసంలో అతనికి స్పృహ తప్పిపోయింది. అలాగే ఆ గుర్రం వీపుమీదే ఒరిగిపోయాడు. ఆ అశ్వం అలాగే ఛాకచక్యంగా మెరుగులా పరిగెత్తింది.

మళ్ళీ కళ్లుతెరిచి చూచేసరికి అతడు మయూరబర్హపురంలో తన సింహాసనంమీద కూర్చుని ఉన్నాడు. పరిచారకులెన్నో విధాల పరిచర్యలు చేసి అతనిబడలిక అంతా పోగొట్టివేశారు. ఇప్పుడు అతని శరీరంలో అలసట అంతా తొలగిపోయింది. పూర్వపు జవసత్త్వాలొక్కమారుగా అతని శరీరంలో ప్రవేశించినట్లొక విచిత్రానుభూతి కలిగింది.

అపూర్వానందోత్సాహాలతో నాలుగువైపులా పరికించి చూచాడు. చుట్టూ చిరపరిచితులైన సభాస్తారులే! పార్శ్వంలో వసిష్ఠమహర్షి! అతడు గంభీరంగా తనవైపు చూచి అలాగే చిరునవ్వు వెన్నెలలు ప్రసరింపజేస్తున్నాడు!

'ఆహా! ఎంతటి విచిత్రాతి విచిత్రమైన మహేంద్రజాలం!' అని సభాస్తారులానందాతిరేకంతో ఆ ఐంద్రజాలికుని చాకచక్యం వేనోళ్ళ ప్రశంసించారు. కాని వసిష్ఠమహర్షి మాత్రం ఎక్కడా చెక్కు చెదరలేదు! అలాగే ఆ ఐంద్రజాలికునివైపు అవలోకిస్తూ కూర్చున్నాడు. మరికొందరు సదస్యులు "ఐంద్రజాలికుడన్నట్లుగా అరగడియలోనే మహారాజు తిరిగి ఇక్కడికి వచ్చివేశారే!' అని ఆయన ఆశ్చర్యశక్తికింతో ఆశ్చర్యపోయారు.

లవణమహారాజు ఆశ్చర్యాబ్ధిలో స్తంభించిపోయాడు. అదంతా కేవలం మహేంద్రజాలమే అంటే అతని కేమాత్రము నమ్మకం కలగలేదు! అతని హృదయంలో పత్నీపుత్రుల క్షుధాక్రందనాలింకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. కాని సభాస్తారులంతా అదంతా కేవలం మహేంద్రజాలమేనని కొట్టిపారవేస్తున్నారు. అయినా వారందరూ ఏకగ్రీవంగా అన్న విషయం కొట్టివేయడానికతని మనస్సొప్పలేదు. ఆ విషయం అంతా వసిష్ఠమహర్షికి విన్నవించి తన మనోవేదన ఉపశమింపజేసుకోవలెనని అనుకొన్నాడు.

అతడింకా ఏదో కలలో ఉన్నట్లే కనిపించాడు. ఎదురుగా నిలిచిన ఐంద్రజాలికుని కెన్నో మణికనక భూషణాలు బహూకరించాడు. అవ్వన్నీ అతిడెంతో భక్తిశ్రద్ధలతో స్వీకరించి వెంటనే అక్కడినించి వెళ్లిపోయాడు. సభాసదులంతా ఆనాటి ఇంద్రజాల విద్యను గురించి ముచ్చటించుకొంటూ నెమ్మదిగా తమ గృహాలకు మరలిపోయారు. ఇక అక్కడ వసిష్ఠ లవణరాజులిద్దరే మిగిలిపోయారు.

లవణరాజుహృదయంలో ఆ అరణ్యంలో పత్నీపుత్రుల దారుణ క్షుధాక్రందనాలింకా మారుమోగుతూనే ఉన్నాయి. అవ్వన్నీ మరుమరీచికలేనా? కేవలం పగటి కలలేనా? అందులో యథార్థమేమి లేదా? రాజు వింధ్యారణ్యంలో ఆ ఆటవికులతో కలిసి అధమం పది పన్నెండు సంవత్సరాలయినా నివసించాడు. వారితోను, భార్యాపుత్రులతోను, ఎన్నెన్నో కష్టసుఖాలనుభవించాడు. అతని హృదయంలో గిరిమల్లికతో కలిసి కొండ కాలవలలో జలక్రీడలాడిన సుఖానుభూతి ఆర్ద్రత ఇంకా అలాగే నిలిచిపోయింది. కాని తిరిగివచ్చేసరికి అరగడియలోనే అదంతా జరిగిపోయినట్లు సభాస్తారులంతా సాక్ష్యం ఇస్తున్నారు.

పదిపన్నెండు సంవత్సరాల సుఖదుఃఖానుభూతిఅంతా అరగడియలోనే ఎలాగ సమాప్తమైపోతుంది? ఆ ప్రశ్న అతని హృదయం కలిగించివేసింది. పిమ్మట వసిష్ఠమహర్షి పాదాలకు ప్రణమిల్లి సవినయంగా విన్నవించుకొన్నాడు:

"మహర్షీ! వింధ్యాటవిలో పది పన్నెండేళ్ళపాటు భార్యాపుత్రులతో కలిసిమెలిసి నివసించాను! ఎన్నెన్నో కష్టసుఖాలనుభవించాను! అదంతా కేవలం మహేంద్రజాలమేనా? దానిలో యథార్థమేమీ లేదా?"

అని తదేకదృష్టితో మహర్షి ముఖంవైపు అవలోకించాడు. మహర్షి మహారాజుముఖం తీక్ష్ణంగా పరిశీలించాడు.

"మహారాజా! మీ రెన్నోమారులు ప్రపంచ పరమార్థం సాక్షాత్కారం కలిగించవలసిందని అర్థించారు. నేను మీకా పరమార్థం సాక్షాత్కరింపచెయ్యవలెననే సంకల్పించాను. అయితే ఎంతటి మహామేధావులైనా, విజ్ఞులందరు భీరువులే! మీరు కూడా ఆ ప్రపంచ పరమార్థం తేరిపార చూడలేరని నా భయం! ముందీ విషయం తేల్చి చెప్పండి!"

అని మళ్ళీ మహారాజుముఖం నిశితంగా పరిశీలించాడు. మహారాజొక చిరునవ్వు నవ్వాడు:

"నేనా పరమార్థ సాక్షాత్కారంకోసమే ఇన్నాళ్ళనించి మీ పాదసేవ చేస్తున్నాను. తమరు నామీద అనుగ్రహమే కలిగితే ఆ సాక్షాత్కారానికి జడిసిపోయే అంతటి భీరువునుమాత్రం కాను!"

"నిశ్చయమేనా?"

"నిశ్చయమే!"

"అయితే మీకు కలిగిన సంశయంమేమో చెప్పండి!"

"నే నరణ్యంలో అనుభవించిన పది పన్నెండేళ్ల కష్టసుఖానుభూతి కేవలం ఇంద్రజాలమేనా? మిథ్యేనా?"

మహర్షి ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు:

"అది ఇంద్రజాలము కాదు! మిథ్య కాదు!"

"అంతా సత్యమేనా?"

"సత్యమే!"

"దీనికి ప్రమాణం?" అన్నాడు మహారాజు.

"మీరే తిరిగి ఒకమారక్కడికి వెళ్ళిచూచివస్తే స్వయంగా మీకే అవగతం కాగలదు. మీ రంతిదూరం ప్రయాణం చెయ్యలేకపోతే అశ్వికుల నెవరినైనా అక్కడికి పంపించి చూడండి! దానితో మీ సంశయవిచ్ఛేదం జరిగిపోగలదు!"

అన్నాడు వసిష్ఠమహర్షి అత్యంత గంభీర స్వరంతో!

"అయితే—"

అని మహారాజు తిరిగి ఏదో ప్రశ్నించబోయాడు.

"మీ కింకా నామాటమీద విశ్వాసం కలగలేదు! ముందుగా అయిదారుగురు అశ్వికులను తగినన్ని ఆహారసంభారాలతో వింధ్యాటవికి పంపించండి! వారు తిరిగివచ్చిన పిమ్మట కొంతవరకు మీ సందేహ నివృత్తి జరగగలదు. ఆటుపిమ్మట మన మీవిషయం చర్చించవచ్చును. ప్రస్తుతం మీరు కొంచెం అలిసినట్లు కనిపిస్తున్నారు."

అన్నాడు మహర్షి.

లవణరాజిక మారుపలకలేదు. కావలసినన్ని భోజన సామగ్రులతోను, భూషణాంబరాలతోను, అయిదారుగురు ఉత్తమాశ్వికులను వెంటనే వింధ్యాటవికి పంపించాడు. వారికి గిరి మల్లిక, ఆమె పుత్రులు, మొదలయిన ఆటవికుల ఆనవాళ్ళన్నీ చెప్పి వారక్కడ ఉన్నదీ లేనిదీ పరిశీలించి రావలసిందని ఆజ్ఞాపించాడు. వారక్కడ కనిపించినట్లయితే ఆ సంభారాలు, భూషణాంబరాలు వారికర్పించవలసిందనీ శరవేగంతో వెళ్ళి తిరిగి రావలసిందనీ ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞ ప్రకారం ఆశ్వికులు, సంభారాలతోను, భూషణాంబ

రాలతో నువింధ్యాటవికి ప్రయాణమై వెళ్ళిపోయారు.

౫

ఆ ఆశ్వికులు వింధ్యాటవికి వెళ్ళి తిరిగి వచ్చేవరకు మహారాజుకు నిద్రపోలేదు ఆఇంద్రజాలమే యాథార్థమయితే ప్రపంచంలో ఇక యథార్థాలెక్కడ ఉన్నాయి? వింధ్యారణ్యానుభూతి అయథార్థమని కొట్టివేయడానికి కూడా అతనికి మనసొప్పలేదు. అందుచేతనే ఆశ్వికులు తిరిగి వచ్చేవరకు అతడలాగే ఎదురు తెన్నులు చూచాడు.

ఒక మాసం రోజులలో ఆ ఆశ్వికులందరు తిరిగి వచ్చారు గిరిమల్లిక, ఆమె పుత్రులు క్షేమంగా ఉన్నారనీ, వారికాహార సంభారాలు, భూషణాంబరాలు సమర్పించామనీ మహారాజుకోసం వారెగురు తెన్నులు చూస్తున్నారనీ గిరి మల్లిక, ఆమె శిశువులు మహారాజు వియోగభారంతో క్రుంగి కృశించిపోయారనీ అన్నారు.

అదివిని మహారాజు నిలువునా నిర్ఘాంతపోయాడు. వెంటనే వసిష్ఠమహర్షి సన్నిధికి వెళ్ళాడు. మహర్షి మహారాజు నెంతో ఆప్యాయంగా తన సన్నిధి కాహ్వానించాడు.

"మహర్షీ! అజ్ఞతవల్ల మీ వాక్కులో యథార్థం కొంచెం శంకించాను. మీరన్నది అక్షరాలా యథార్థమైనది అయితే ప్రస్తుత జీవనలీలలో యథార్థమేదో అయథార్థమేదో నిర్ణయించుకోలేకపోతున్నాను."

అన్నాడు మహారాజెంతో సందేహిస్తూ.

"ప్రపంచంలో అయథారమేదీలేదు మీ మయూరబర్హనగరానుభూతి, అరణ్యానుభూతి రెండు యథార్థాలే! కాని నగరానుభూతి దృష్ట్యా పరిశీలిస్తే అరణ్యానుభూతి మిథ్యగా భాసిస్తుంది. అరణ్యానుభూతి దృష్ట్యా పరిశీలిస్తే మీ నగరానుభూతి మిథ్యగా భాసిస్తుంది. అంతే! జాగృద్దృష్టిలో స్వప్నానుభూతి మిథ్యగా భాసించవచ్చును స్వప్నానుభూతిలో జాగ్రదనుభూతి మిథ్యగా భాసింపవచ్చును"

మహారాజు తాను విన్నది యథార్థమా? మిథ్యా? అనే మీమాంసలో పడ్డాడు. తిరిగీ ప్రశ్నించాడు:

'అయితే స్వప్న జాగ్రదవస్థల అనుభూతుల యథార్థతలలో తారతమ్యం లేదా?" అన్నాడు

వసిష్ఠ మహర్షి మళ్లీ చిరునవ్వు నవ్వాడు. మహారాజడిగిన ప్రశ్న కెంతో ఆనందించాడు:

"మహారాజా! వ్యావహారిక దృష్టిలో మీరు చెప్పిన తారతమ్య పూర్వకమైన యథార్థత లేకపోలేదు. కాని పారమార్థిక దృష్టిలో రెండిటి యథార్థతా సమానమే!"

లవణరాజు హృదయంలో సంశయగ్రంథి విడిపోలేదు. తిరిగి సవినయంగా ప్రశ్నించాడు:

"నేను తిరిగివచ్చేసరికొక అరగడియ కూడా జరగలేదు. ఈలోగా పదిపన్నెండు సంవత్సరాలు జరిగాయంటే నాకేమీ అవగాహన కావటంలేదు."

"మహారాజా! ఒక క్షణం వేయి యుగాలుగా భాసించవచ్చును. అలాగే వేయి యుగాలొక క్షణంగా భాసించవచ్చును మానవుల సంవత్సర సహస్రాలు దేవతలకొక దివసంగానే భాసిస్తాయి. అలాగే ఒక్క అణువొక బ్రహ్మాండంగా ప్రత్యక్షం కావచ్చును బ్రహ్మాండం అంతా ఒక అణువంత అల్పాల్పమై ప్రత్యక్షం కావచ్చును. ఇవన్నీ దృష్టిభేదంవల్ల ఏర్పడే తారతమ్యాలు, మిథ్యాభావనలు. అంతేగాని పరమార్థ దృష్టిలో తారతమ్యము, మిథ్య అనేవేమీ లేవు సర్వము పరమార్థ స్వరూపమే. సాపేక్షదృష్టితో పరిశీలించినపుడే సాపేక్ష మిథ్యాత్వం గోచరిస్తున్నది. కాని పరిపూర్ణ దృష్టికన్నీ పరమార్థాలే!"

ఆ మాటతో లవణమహారాజు హృదయంలో ప్రపంచ పరమార్థస్వరూపం అంతా తళుక్కున మెరిసింది. పిమ్మట ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టాడు.

"అయితే ఈ మయూరబర్హపురము, ఈ మహారాజభోగాలు, ఈ అంతఃపురాంగనలు ఈ అనురాగాలు — ఇవ్వన్నీ ఎలాంటి యథార్థాలో అరణ్యంలోని గరిమలిక, ఆమె పుత్రులూ వారి అనురాగాలు అలాంటి యథార్థాలేనన్నమాట!"

"స్వయంగా మీ కళ్లతో మీరే తిలకించారుగదా! ఇంకా వేరె వన్నడుగనేల?" అన్నాడు వశిష్ఠమహర్షి.

౬

ఆ వాక్యం వినగానే మహారాజ హృదయంలో వేలాడే నీలి నీలి తెరలన్నీ ఒక్కమారుగా తొలగించివేసినట్లయింది. అరగడియలో జరిగినా ఆ అరణ్యానుభూతులన్నీ యథార్థాలే ఆ అనుభూతుల దృష్ట్యా పరిశీలిస్తే ఇనాళ్లనించీ అనుభవించిన నగరానుభూతులన్నీ కేవలం మిథ్యలే! పరస్పర తారతమ్యంలో రెండు మిథ్యలే! రెండు యథార్థాలే! అయితే మహారాజు తాను కళ్ళారా చూచినవి కేవలం మిథ్యలని భావించలేకపోయాడు. అన్నీ యథార్థాలే అని నిశ్చయించుకొన్నాడు. పరమార్థ జ్ఞానోపదేశం కోసం మహర్షి మహత్తపశ్శక్తితో తనకా విధమయిన విచిత్రానుభూతి కలిగించి ఉండవచ్చునని అనుకొన్నాడు ఆ వినూతన విజ్ఞాన భాస్కరోదయంతో అతని హృదయంలోని రాగద్వేషాది ద్వంద్వాల అంధకారం అంతా పటాపంచలైపోయింది! హృదయంలో ఆవరించుకొన్న అభిమానాహంకారాదులన్నీ మంచు విడిపోయినట్లు విడిపోయాయి ఆ పరిస్థితిలో అతనికొక అనిర్వాచ్యమైన నిర్లిప్తానందస్థితి అనుభూతి కలిగింది ఆ ఆనంద తన్మయతలో అతని పెదవులపై ఒక మందస్మితం నిశ్చలంగా నిలిచింది అంతలోనే ఏదో జ్ఞప్తికి వచ్చింది. అయితే తన ప్రస్తుత కర్తవ్యం?

మహారాజు మళ్ళీ ప్రశ్నించాడు:

"మహర్షీ! ఒక క్షణమైనా ఏమరకుండా ధర్మదృష్టితో నేనీ మహారాజ్యం పరిపాలించాలి! ఇది నా క్షాత్రధర్మం! అరణ్యంలో వివాహమాడిన గిరిమలికను, ఆమె పుత్రులను పరిపాలించవలసిన ధర్మం కూడా నాదే! ఇప్పుడు నేను పరిపాలించవలసిన ముఖ్య ధర్మమేది?"

వసిష్ఠమహర్షి కొంచెంసేపాలోచించి ఉపదేశించాడు:

"మహారాజా! మీ కీక్షణంలో పరమార్థ సాక్షాత్కారం కలిగింది. ఇక ధర్మాధర్మ నిర్ణయం చెయ్యవలసినది మీరే కాని నేను కాదు!" అని మహర్షి తిరిగీ ఒక చిరునవ్వు నవ్వాడు.

"నాకది తెలియక పోలేదు. అయినా ఆచార్య గౌరవంతో మిమ్మల్ని అర్థిస్తున్నాను." అన్నాడు మహారాజు.

"ఈ ధర్మసూక్ష్మంలో కూడా వ్యావహారిక దృష్టిలో కొంత తారతమ్యం ఉంటే ఉండవచ్చును కాని పారమార్థిక దృష్టిలో రెండూ ఒకటే!"

ఆ మాట వినగానే మహారాజు మనస్సులో సంశయగ్రంథులన్నీ పటాపంచలయిపోయాయి ఒకపరిచారకుణ్ని పిలిచి వెంటనే ఒక ఉత్తమాశ్వాన్ని ఒకే ఒక్క క్షణంలో సర్వసిద్ధం చేసి తీసుకు రావలసిందని ఆజ్ఞాపించాడు. మహర్షికి సాష్టాంగ నమస్కారం చేసి ఆశీర్వదించవలసిందని అర్థించాడు. అంతలోనే పరిచారకుడుత్తమాశ్వాన్ని రాజ సన్నిధికి తీసుకువచ్చాడు

మహర్షి అతని శిరస్సుపై ఆశీర్వర్షం కురిపించాడు:

"మీరీ విధంగా రాజ్య పరిత్యాగం చేసి అరణ్యానికి వెళ్లవలసిన ఆవశ్యకత నాకేమీ గోచరించడం లేదు!" అన్నాడు మహర్షి.

"ఆటవికులైన భార్యాపుత్రులకు ద్రోహం చేశాననే పశ్చాత్తాపం నన్నింకా విడిచిపెట్టలేదు" అన్నాడు మహారాజు.

"మరి అనాథులయిన మయూరబర్హ ప్రజలను ఎవరికప్పగిస్తున్నారు!" అన్నాడు మహర్షి!

(56-వ పేజీ చూడండి)



మినర్వా వారి "సారంగధర" చిత్రంలో సురభి బాలసరస్వతి.

# 'పెద్దమనుషు లున్నారు జాగ్రత్త'!

కూపంలో అతణ్ణి తరిమి తరిమి కొడుతుంది. ఈ వాటానించి, ఆ వాటాకి, ఆ గదినించి ఈ గదికి, క్షణం నిలకడలేకుండా పరుగులు పెడతాడు ఆ మనిషి. అలా పారిపోతున్న అతడికి, తెరవెనక భాగోతాలు, నిజాల వెనక నిజాలు, గోచరిస్తాయి దొంగలూ, కోరలూ, వంచకులూ, వంచితులూ పరిచితు లవుతారు పరిస్థితులు ఎటు పొమ్మంటే అటు, ఎండుటాకులా ఎగిరిపోతూ, లేస్తూ పడుతూ ఆపదల నీడలోనే పరుగులు పెడుతున్న ఆ అసామి ఇవన్నీ చూసి విసుపో గలిగేటంత అమాయకుడు, తన పీకమీద కత్తిని క్షణంసేపు మర్చిపోయి, ఆపదలో ఉన్న ఎదటి మనిషిమీద జాలిపడగల మంచి మనసున్నాడు. సరే ఈ దొంగకోసం ఇల్లంతా గాలించి పెంకులు తిరగేసేసరికి అక్కడున్న నిసలైన తేళ్ళు పాములూ, చీడపురుగులూ బయటపడతాయి తెల్లవారేసరికి చీకటి జీవులన్నీ తలవంచుకుని సర్కారువారి చీకటి గదులలోకి వెళ్తాయి ఇదే కథ

దర్శకులు ఈ కథలో విశిష్టమైన ఈ పాత్రను ప్రశంసనీయంగా చిత్రించారు కోరూ వావీ లేని మనిషి కాబట్టి, మొదటి నించీ చివరివరకూ కనబడుతునే ఉండే ఈ పాత్రకు సంభాషణలు పెట్టలేదు ముందు ఒకసారి, చివర ఒకటి రెండుసార్లు మాత్రం మాట్లాడిస్తారు కథను నడిపేవీ కథలోని మిగతా పాత్రలపట్ల ప్రేక్షకులకు అనురాగం, ద్వేషం కలిగించేవి సంఘదురాచారాలను గుయ్యబట్టేవీ హేళన చేసేవీ ఈ పాత్ర నిర్వహించిన రాజ్ కపూర్ ప్రదర్శించిన హావభావాలే గురుతరమైన ఈ బాధ్యతను రాజ్ కపూర్ ఎక్కడా 'అతి' అనిపించకుండా, సమర్థంగా నిర్వహించాడు.

కొత్తరకాల కత్తియుద్ధాలు హాలీవుడ్ హాట్ నంబర్ బాణీలు, విదేశీవాళీ డాన్సులూ మొదలైన బాక్సాఫీస్ 'సూత్రాలు' ఈ చిత్రంలో పారిపోతున్న 'దొంగ' కాళ్ళకి అడ్డంపడి, అతన్నీ, కథనీ, అక్కడే నిలబెట్టడానికి దర్శకులు అవకాశం ఇవ్వలేదు. ఈ చిత్రంలో పాటలూ, రెండు నృత్యాలూ ఉన్నాయి అవి కథాగమనానికి అడ్డురాకుండా చూపించారు సలీల్ చౌదరి వాటికి కూర్చిన సంగీతం చాలా బాగుంది ఇందులో పురుషులు పాల్గొనే ఒక పంజాబీ జానపద నృత్యం అత్యంత ఆకర్షణీయంగా ఉంది

మోతీలాల్, నీమో, పహారీసన్యాల్, ప్రదీప్ కుమార్ వంటి పెద్ద నటులందరినీ కూడా చిన్న చిన్న వేషాలే అయినా గొప్పగా నిర్వహించారు సుమిత్రాదేవి, స్మృతిబిశ్వాస్, కూడా చక్కగా నటించారు. చిత్రంలో ప్రతి సన్నివేశంలో చక్కని హాస్యం, విమర్శ, హేళన, మిళితమై ఉన్నాయి. అనేక సందర్భాలలో ఉత్కంఠ చక్కగా పోషించబడింది మోతీలాల్ సుమిత్రాదేవి పాల్గొన్న ఘట్టంలో మాత్రం పతివ్రతా ధర్మంపై కొంత విజ్ఞానగోష్ఠి జరిపించారుగాని, మోతీలాల్ ప్రతిభవల్ల, అది బాగానే ఒప్పింది

మొత్తంమీద కథాచిత్రణలోనూ, ప్రధాన పాత్ర చిత్రణలోనూ కూడా రాజ్ కపూర్ కు, చార్లీచాప్లిన్ పద్ధతిపట్ల గల మమభావం, 'సిట్లీ'గా కనబడే స్టాన్ లారెల్, ఆలివర్ హార్డీల శిల్పంపట్ల గల అభిమానం గోచరిస్తాయి స్లాప్ స్టిక్ కామెడీ శిల్పాన్ని కూడా దర్శకులు ఎక్కడా వికటించకుండా సద్వినియోగం చేసుకున్నారు

'జాగ్ తే రహో' చిత్రం, అందులో రాజ్ కపూర్ నిర్వహించిన పాత్ర చలన చిత్రాల కథలో ఒక విశిష్ట స్థానం సంపాదించుకుంటాయి

ఈ చిత్రం బొంబాయి నగరంలో తయారవటం గొప్ప విశేషం. ఈ ప్రయత్నానికి పూనుకుని మంచి ఫలితం సాధించిన శ్రీ రాజ్ కపూర్ అభినందనీయుడు

'జాగ్ తే రహో' బెంగాలీ ప్రతి 'ఏక్ దిన్ రాత్రే' (ఒక రోజు రాత్రి) అన్న పేరుతో బెంగాల్ లో విడుదల అయి బహుళ జనాదరణ పొందింది.

'జాగ్ తే రహో' ఒక సారి తప్పక చూడతగిన చిత్రం ★

## 'పునర్జన్మ' నాటక ప్రదర్శనం

'కళోదయ' (మద్రాసు) సంఘం వారు ఈ నెల 9వ తేదీ సాయంత్రం మద్రాసు సౌందర్య మహల్ లో "పునర్జన్మ" అనే సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఇందులో పాల్గొన్న కుమారి కృష్ణజ్యోతి, బేబి అనసూయ, గుర్నారావు, రామకృష్ణ, వెంకటేశ్వర రావు, విశ్వనాథం, గోపాలకృష్ణ, వినాయకరావు మొదలగు వారంతా చక్కగా నటించారు

శ్రీ చిత్తూరు నాగయ్య ప్రదర్శనానికి అధ్యక్షత వహించారు

ఇంటర్వెల్ లో, శ్రీయుతులు జె వి. సోమయాజులు, లింగమూర్తి, డా॥ ఎం వి. రావు ప్రసంగించారు

## లవణ రాజు కల

( 9వ-పేజీ తరువాయి)

"ఏమా చలని పరిపాలనలో వారి కేవిధమైన లోపము కలగదనే ధైర్యంతోనే నేను రాజ్య పరిత్యాగం చేస్తున్నాను" అన్నాడు మహారాజు వెంటనే ఆ ఉత్తమాశ్వం అధిరోహించాడు

వసిష్ఠ మహర్షి—"నేను కేవలం సర్వసంగ పరిత్యాగం చేసిన విరాగిని! నాకీ పరిపాలన బంధనం కల్పించడం మీకు ధర్మం కాదు!" అన్నాడెంతో విరక్తితో.

"కనకనే ఈ ప్రజా పరిపాలన మీకప్పగించి పోతున్నాను!" అన్నాడు మహారాజు

మరుక్షణంలో అతడొకసారి అంతఃపురంవైపు, అమహానగరంవైపు చూచాడు ఒక్క వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు.

అటు పిమ్మట ఆ అశ్వాన్ని గట్టిగా అదిలించాడు అది దివ్య విద్యుద్వేగంతో వింధ్యాటవి వైపు పరుగెత్తుకు పోయింది. దాని గమనధ్వని వసిష్ఠమహర్షి హృదయంలో మందమందంగా ప్రతిధ్వనించింది ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street. Madras-1 Editor S Sambhu Prasad.